

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - 24 -

ఆపరేషన్ పూర్తయే సరికి రాత్రి  ఎనిమిదవుతోంది.

డాక్టర్ సుబ్బయ్య గారిని పంపించడానికి బయటి వరకూ వచ్చింది. ఆయన పక్క ఊర్లో ఉంటారు. స్కూటర్ మీద రావడానికి అరగంట పడుతుంది. కేసుందంటే విసుక్కోకుండా అంత దూరం నుండి వస్తారు, ఎనస్థీషియా ఇవ్వడానికి.

బయటకొచ్చి నిలబడితే రివ్వున చల్లగాలి వీస్తోంది. పైకి చూస్తే, నల్లటి మబ్బుల్లో అప్పుడప్పుడు మెరుపులు కనిపిస్తున్నాయి.

"సార్, వాన పడేట్లుంది" అన్నది.

ఆయన కూడా పైకి చూసి " ఈ గాలిలో కష్టమే. ఇవాళ మా సోము వాళ్ళింట్లో పడుకుని, రేప్పొద్దున్నే వెళ్తాను." అన్నాడు.  ఈ ఊళ్ళో, ఆయనకు బంధువులు ఉన్నారు.

అంత రాత్రి శ్రమతీసుకుని వచ్చినందుకు ఆయనకు మరీ మరీ థాంక్స్ చెప్పింది. ఆయన ఒక చిన్న సూట్ కేస్ లాంటిది తెచ్చుకుంటారు. ఆ పెట్టె తీసుకుని వచ్చాడు రాంబాబు. ఆయన చేతికి కవర్ ఇవ్వమని రాంబాబుకి , కళ్ళతో చెప్పి, లోపలికొచ్చేసింది.

తన కన్సల్టేషన్ రూం లో కూర్చుని ఫోన్ వంకే చూస్తోంది. వాణి ఉదయం ఫోన్ చేసి , ఒక హెల్ప్ కావాలనీ, రాత్రికి మళ్ళీ చేస్తాననీ, చెప్పింది. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఎప్పుడో గానీ మాట్లాడుకోరు. ఎప్పుడు మాట్లాడుకున్నా, 'నిన్ననే మాట్లాడుకున్నారా' అన్నంత మామూలుగా ఉంటుంది, సంభాషణ. కొన్ని చెట్లకు రోజూ నీళ్ళు పోయక్కర్లేదు.

ఎంత సేపటికీ రాదేం ఫోన్?

'ఫోన్ వంకే చూస్తూ ఉంటే రాదు. అవతలి వాళ్ళు చేస్తే వస్తుంది. మనం వేరే పనిలో ఉన్నా వినబడేందుకు, గ్రహం బెల్ దానికో బెల్ పెట్టాడు.' అనుకుంటూ లేచింది.

లోపలికి వెళ్ళి ఆపరేషన్ అయిపోయిన పేషంట్ ని చూసి మళ్ళీ వచ్చి ఫోన్ దగ్గర కూర్చుంది.

ఆయమ్మ భోజనం వడ్డిస్తానని చెప్తే వద్దని చెప్పి, తనని తినెయ్యమంది.

వాణి సిటీలో పేరున్న డాక్టర్.  లంచ్ కు, రాత్రి భోజనానికీ , తనకు ఒకే టైం. సాయంత్రం ఆరుగంటలకు! ప్రాక్టీసుతో క్షణం తీరికుండదు.  దమ్మిడీలు లెక్కబెట్టే టైము కూడా ఉండదు.  ఆ పని, బాగా తీరికున్న ఆమె భర్తే చేస్తుంటాడు. ఆమెకు వీలు కుదిరి, ఫోన్ చేసిందంటే పెద్ద కారణమే అయ్యుంటుంది.

చిన్న ఊరిలో ప్రాక్టీసు చేసుకునే తను వాణికి చెయ్యగల సహాయమేమిటో తెలిసే వరకూ కుదురు లేదు.

బయటికి చూసింది. కిటికీ అవతల వేపున్న చెట్టు మీద పక్షులు రాత్రయినా సరే, ఇంకా గొడవలు పడుతూనే ఉన్నాయి. అదొక చిన్న టౌన్. పల్లెటూరంటే ఊరు ఊరుకోదు. నాలుగు రోడ్లున్నాయి. కొన్ని డాబాలున్నాయి. ఒక సినిమా హాలుంది.

డాక్టరమ్మ గా తను పెట్టిన హాస్పిటల్ ఉంది. ఒక ఊరుని టౌననడానికింత కన్నా ఏం కావాలి?

ఆమె ఎదురు చూస్తున్న ఫోన్ పదింటికి వచ్చింది.

వాణి వాళ్ళ అక్క , ఈ పల్లెటూరికి దగ్గర్లో ఉంటుంది. ఆమె కొడుకు చదువుకోసం అత్యవసరంగా డబ్బు అవసరం అయింది. రేపటిలోగా కట్టేయాలట. అక్కకు పంపించడానికి వాణి చేతిలో డబ్బులేదు.

"అంత ప్రాక్టీసు చేస్తూ, నీ దగ్గర డబ్బు లేకపోవడమేంటి?" ఆశ్చర్యపడింది స్నేహితురాలు.

"అన్నీ ఆయనే చూస్తారు కదా. నాకెందుకు వేరే డబ్బు?"

వాణి సంపాదించే డబ్బు, ఇంటి ఎకానమీ విషయాలన్నీ, ఇంట్లో అమర్త్యసేన్ వారే చూసుకుంటారట. అక్కకు సహాయం చెయ్యడం గురించి భర్తని ఒప్పించడం ఎంత కష్టమో తనకు అర్థమయేలా వివరించింది.

వాణి సెమినార్ చెప్పినా అంతే చక్కగా ఉంటుంది. ఇక ఆ టాపిక్ వేరే చదవక్కర్లేదు. భర్త ముందు మ్మాట్లాడాలన్నపుడే ఆమెకెక్కడలేని కంగారొస్తుంది. తడబడిపోతుంది.

'వైట్ మనీకి, బ్లాక్ మనీకి తేడా తెలియదు. టాక్సులేమిటో తెలియదు. అంత తెలివితక్కువ మేళం డాక్టర్ ఎలా అయిందో , అంత ప్రాక్టీసు ఎలా వచ్చిందో' నని ఆయనక్కూడా ఆశ్చర్యం.

"త్వరలోనే ఇచ్చేస్తాను. అక్క వాళ్లబ్బాయి రేపు పదింటికి వస్తాడు నీ దగ్గరకు. కొంచం సర్దవా?" అని మొహమాటపడుతూ అడిగింది వాణి.

వాణి స్థాయికది చిన్నమొత్తం. చిన్న ఊళ్ళో ప్రాక్టీసు చేసే తనకది పెద్ద మొత్తమే. వాణి, ఇదివరకెప్పుడూ ఇలాంటి సాయం అడగలేదు. బహుశా ఇంకెవరినీ అడగలేదేమో! తన సర్కిల్ లో డాక్టర్లను అడగలేదు. ఈ పల్లెటూరి స్నేహితురాలికి తప్ప ఆమె ఇంటి విషయాలు ఇంకెవరికీ తెలియవు.

రేపట్లోగా సర్దుతానని వాణికి మాటిచ్చింది. ఫోన్ పెట్టేశాక లోపలికి వెళ్ళి డబ్బెంత ఉందో చూసి లెక్కపెట్టింది. ఎన్నేళ్ళు గడిచినా నైపుణ్యం సంపాదించలేని కొన్ని కళలుంటాయి. వాటిలో, నోట్లు లెక్కబెట్టడం ఒకటి.

వాణి చెప్పిన మొత్తానికి కొన్ని నోట్లు తక్కువైతే, తన హాండ్ బాగ్ లో ఉన్న నోట్లు కూడా కలిపింది.

అన్నిటినీ వరసలో పెట్టి రబ్బర్ బాండ్ వేసి తెల్లటి కవర్ లో పెట్టింది. దాని వైపు సంతృప్తిగా చూసి, టేబిల్ సొరుగులో పెట్టింది.

అప్పటికే బాగా లేటయ్యింది. అలసిన కళ్ళు నిద్రపోతామంటుంటే, ఆలోచనలు ఒప్పుకోవడం లేదు.

వాణి కేదో తెలివి లేదని ,స్వాతంత్ర్యం లేదని అనుకుంటోంది కానీ, తనుమాత్రం ఏం తెలివిగా ఉంది? ఎన్నో ఏళ్ళ నుండీ పనిచేస్తోంది. డబ్బు ఎలా పొదుపు చెయ్యాలో తెలియదు. ఇంత పెద్ద చదువులు చదివిన వాళ్ళకు ఎవరు నేర్పాలి? ఎవరొస్తారు నేర్పడానికి?

ఎప్పటికో నిద్రపట్టినట్టనిపిస్తుంటే, కళ్ళ మీద లైట్ పడింది. ఆగకుండా ట్రాక్టర్ శబ్దం. మనుషుల అరుపులు.

ఎదురుగా ఉన్న స్థలంలో, ఆ మధ్యన పునాదులు తవ్వారు. బహుశా సిమెంటు, ఇటుకలు తీసుకొచ్చిన ట్రాక్టర్ అయి ఉంటుందనుకుంది. మెదడెప్పుడూ, నిజాలకన్నా, సౌకర్యవంతమైన జవాబులందిస్తుంటుంది.

రెండు క్షణాల తర్వాత, తమ ఇంటి గేటు తెరిచిన శబ్దం వినిపించింది. ముందు గది తలుపులు ఆగకుండా కొడుతున్నారు. వరండాలో పడుకున్న రాంబాబు కూడా నిద్రలేచినట్లున్నాడు. అతని గొంతు కూడా వినిపిస్తోంది. ఎవరో ఏమిటో కనుక్కుంటున్నట్లున్నాడు.

వెంటనే లేచి వరండాలో లైటు వేసింది. ముందు గదిలో నిద్రపోతున్న ఆయమ్మని లేపింది.

తలుపులు తీసి బయటకొచ్చి నిలబడి చూస్తే, ట్రాక్టర్ సరిగ్గా తమ గేటు ముందు ఆపి ఉంది. అందులోనుండి తేలికగా ఉన్న ఒక ఆడమనిషిని కిందకు దింపుతున్నారు. ట్రాక్టర్ పైనుండి , ఇద్దరు ఆడవాళ్ళు కిందకు దూకేసి ఆ మగవాళ్ళ వెంట నడుస్తున్నారు. అందరిలోనూ ఆదుర్దా ,కంగారు.

వాళ్ళు మోసుకున్న స్త్రీలో చలనం లేదు. ఆమె ప్రాణాలతోనే ఉందా అన్న అనుమానం వచ్చింది, గుమ్మంలో నిలబడ్డ డాక్టర్ కు.

హడావుడిగా విషయం చెప్పారు, ఆవచ్చిన వాళ్ళు. ఇంటి వద్ద కాన్పు అయింది. మాయ విడిపడలేదు. దాన్ని బయటికి పంపించడానికి , గర్భాశయం తన శక్తినంతా ధారపోస్తోంది. ఆమెను మోసుకొచ్చిన దారిలో పడిన ధారను తడి గుడ్డతో తుడిచేస్తోంది ఆయమ్మ.

పేషంట్ వాలకం, రక్తం పోతున్న తీరు చూస్తే చల్లటి ముసురు గాలిలో నిలబడ్డ ఆమెకు చిరు చెమటలలుముకున్నాయి. ఇంత ప్రమాదకరమైన కేసుకి, ఇంత చిన్న హాస్పిటల్ లో న్యాయం ఏం జరుగుతుందీ?

“రాంబాబూ, మన ఎనస్థీషియా డాక్టర్ వాళ్ళ బంధువులింట్లో పడుకుంటానన్నారుకదా. వెళ్ళి తీసుకురా.”

“ఆరిల్లెక్కడో తెలవదమ్మా.”

“ఇదేమైనా సిటీనా, తెలియకపోడానికి . ఎవర్నైనా కనుక్కో. త్వరగా తీసుకురా.”

రాంబాబునటే పంపించి లోపలికి వచ్చింది.

అప్పటికే ఆమెను టేబిల్ మీద పడుకోబెట్టారు.

ఆమె తెల్లగా ఉంది. తెల్లగా, పాలిపోయింది. గోడ రంగుకూ, ఆమె రంగుకూ తేడా లేనంత తెల్లగా! వంటి మీద పసుపు పచ్చ సిల్క్ చీర. తడిని పీల్చు కోవడం చేతకాక గరగరలాడుతోంది. ఆమెనంటుకున్న గడ్డి పరకలాపని చేసి ఎర్రబడ్డాయి.

ఆమె చెయ్యి పట్టుకుంటే, చల్లగా ,తడిగా ఉంది. నీళ్ళలో ముంచినట్లు శరీరమంతా నీరు నీరుగా ఉంది.

పల్స్ అనేది పాతాళంలో కొట్టుకుంటోందో , లేక అది తన భ్రమో? ఆయమ్మను చెయ్యి గట్టిగా పట్టుకోమని చెప్పి, సెలైన్ పెట్టేందుకొక రక్త నాళం కోసం చూస్తే, సన్నటిదొకటి దొరికింది.

ఎలా అయినా సరే ఇది అందాల్సిందే అన్న పట్టుదలతో కాన్యులా పెట్టింది. ఆ టైములో ఆ పేషంట్ కు రక్తనాళం దొరకడం , కరెక్ట్ గా కాన్యూలా పెట్టడడం, అందరాని అదృష్టం చేతికందినట్టనిపించింది. ఆక్సిజన్, సెలైన్ వేగంగా నడిచిన కాసేపటికి, పల్స్ చేతికందుతోంది. బీపీ ఆపరేటస్ లో నంబర్లు కనిపించాయి.

ఇంకాస్త గడిచాక ఆమె కాస్త మూలుగుతోంది.

అప్పటికి ,రాంబాబు తో కలిసి డాక్టర్ సుబ్బయ్య గారు వచ్చారు. ఆమెకు సెడేషన్ ఇచ్చి, మాయ బయటికి తీయడానికి పెద్ద సమయం పట్టలేదు.

అక్కడికి ఇరవైకిలో మీటర్ల దూరంలో బ్లడ్ బ్యాంక్ ఉంది. వాళ్ళకు ఫోన్ చేసి అర్జంటుగా రక్తం కావాలంది.

బంధువులతో ఆమె పరిస్థితి ఎలా ఉందో చెప్పి, బ్లడ్ కోసం పంపించుదామని , బయటికి వచ్చి“ఈ అమ్మాయి బంధువులెవరూ?” అంది.

పక్కింటో ఉంటామని చెప్తూ ఓ నడివయసామె ముందుకొచ్చింది.

“భర్త ఏడీ?”

“నిన్న సందెకాడ పొలంలో పంజేస్తంటే నెప్పులొచ్చినయి. ఆస్పత్రికి తీసుకెళ్ళమని చెప్తానే ఉండాం ఆ పిల్లాడికి. ఇయ్యి ఉడుకునెప్పులే పిన్నీ అని ఈ పిల్ల చేతిలో కూలి డబ్బులట్టుకుపోయాడు. ఎక్కడో తాగి పడిపోయుంటాడు.”

డాక్టరమ్మకు ఏమ్మాట్లాడాలో అర్థం కాలేదు.

”మేమే ఇళ్ళకాడ కాన్పు చేసే నరసమ్మని పిలిచాము.మాయ పడకపోతంటే నరసమ్మ నావొల్లకాదంది. మా ఊరి రెడ్డిగారు ట్రాక్టర్నీ, డ్రైవర్నీ ఇచ్చి పంపిచ్చారు.” అంది.

లోపలికి వెళ్తే సుబ్బయ్యగారు అన్నీ సర్దుకుంటూ, “ప్రస్తుతానికి పర్లేదు కానీ, బ్లడ్ అరేంజ్ చెయ్యండి . మరీ ఎనీమిక్ గా ఉంది.” అన్నారు.

“బ్లడ్ బాంక్ వాళ్ళకు ఫోన్ చేశానండీ. శాంపుల్ తో మనిషిని పంపించమన్నారు. రాంబాబు వెళతాడు.” జవాబు చెప్పింది ఆమె.

“ నేనెటూ అటే వెళ్తున్నాను . నా స్కూటర్ మీద తీసుకెళ్తానన్నా”రాయన.

“రాంబాబూ , శాంపుల్ తీసుకుని త్వరగా సార్ తో వెళ్ళు.”

ఆమె నుండి శాంపుల్ తీసుకుని డాక్టర్ వంకే చూస్తూ నిలబడ్డాడు రాంబాబు.

‘కదలవేం?’ అన్నట్టు అతని వంక చూస్తుంటే అర్థమయ్యింది. బ్లడ్ బాంక్ వాళ్లకు , సుబ్బయ్యగారికీ ఇవ్వాల్సిన డబ్బుకోసం నిలబడ్డాడని.

లోపలికి వెళ్ళి రాత్రి వాణి అక్కకొడుకు కోసం దాచి పెట్టిన డబ్బు కవర్ తీసింది. కొన్ని నోట్లను, రబ్బర్ బాండ్ నుండి తప్పించింది.

తొమ్మిదింటికి వాణి వాళ్ళ బంధువు వస్తాడు. మనసు గుర్తు చేసింది.

రాంబాబుని పంపాలి ముందు. తర్వాతి సంగతి తర్వాత!

***

తెల్లవారే లోపల రెండు యూనిట్స్ రక్తం ఎక్కించాక ముఖంలో తెలుపు తగ్గింది. అవసరమైన ఇంజెక్షన్లు కొన్ని చేసింది. రక్తం పోవడం ఆగింది.

ఆమె వంటి మీదున్న గరుకు సిల్క్ చీర, ఊపిరాడని బ్లౌజ్ చాలా అసౌకర్యంగా అనిపించి ,తీసేయించింది.

వళ్ళంతా శుభ్రం చేసి, పొడిగా తుడిచి, మెత్తటి నైటీ వేశారు. ఆమెను శుభ్రమైన బెడ్ మీదకు మార్చి, వెచ్చని బ్లాంకెట్ కప్పి, పడుకోబెట్టిన రెండు నిముషాలకే , పక్కకు తిరిగి పసిబిడ్డలా నిద్రపోతోంది పేషంట్.

చాలా బడలికగా ఉండి ఉంటుంది. దూరం ప్రయాణం చేసి, వెనక్కి తిరిగి వచ్చింది. తనకెవరు పుట్టారో కూడా ఆమెకు తెలియదు. వయసులో చిన్నపిల్లలా ఉంది.

పక్కనే ఉయ్యాల్లో, ఆమె బిడ్డ లైట్ల వంక చూస్తూ ఉంది. చప్పుడు చేస్తూ, గులాబి గుప్పెళ్ళు చీకుతోంది.

***

చూస్తుండగానే తెల్లవారింది. అప్పటివరకూ పేషంట్ కు దగ్గర్లో ఉండి చూసుకుంటూ ఉంది. ఇక ప్రమాదం లేదని అనిపించాక బయటికి నడిచింది. ఇంటి ఎదురుగా ట్రాక్టర్ లేదు. రాత్రి హడావుడికి సంబంధించిన ఆనవాళ్ళేమీ లేవు. వరండా అంతా శుభ్రంగా ఉంది. ఇంటి ముందున్న పూలమొక్కల మధ్యకు నడిచింది.

మెలికలు తిరిగిన సన్నజాజి తీగె, వంకీ పూలజడ వేసుకుని డాబా మీదకు పాకుతోంది. పొదుగాటి పొన్న చెట్టు, నేలమీద నక్షత్రాల ముగ్గు వేసింది. చెట్టునిండా పూసిన తెల్లని నంది వర్ధనాలు ఇంకో పక్కన గులాబి రంగు గన్నేరు పూలు సుకుమారంలోనూ, పరిమళంలోనూ పోటీ పడుతున్నాయి.

వంటావిడ కాఫీ తెచ్చి డాక్టరమ్మ చేతికిచ్చింది. సన్నజాజి తీగె పక్కనే ఉన్న సిమెంట్ అరుగు మీద కూర్చుందామని వెళ్తుంటే, వరండా గ్రిల్ పక్కనే, కూర్చుని ఉన్న ఒక ఆడమనిషి కనిపించింది. డాక్టరమ్మని చూడగానే, ఆమె లేచి నిలబడింది.

రాత్రి, ఆ పేషంట్ కు తోడుగా వచ్చినావిడ.

ఆమె పక్కన ఎవరూ లేరు. నిన్న రాత్రి పొలం వెళ్ళిన బట్టలతోనే వచ్చినట్టుంది. నీలం రంగు చీర కుచ్చిళ్ళు పైకి ఉన్నాయి. నల్లటి కాళ్ళకు మెట్టెలు. జుట్టంతా రేగిపోయి ఉంది. నిద్రలేక ఎర్రబడిన కళ్ళు.

ఆమె ఎంత సేపట్నుండీ అక్కడ ఉందో? తను చూసుకోలేదని కొద్దిగా మొహమాట పడుతూ

“ఏ ఊరు మీది?” అడిగింది.

చాలా వినయంగా ఊరి పేరు చెప్పింది. పక్కనే ఉన్న పల్లెటూరు.

“ఆ అమ్మాయి బంధువులేరి?"

“ఆయమ్మాయిది మా వూరు కాదమ్మా, ఎక్కడో లంకల్లో ఉంటారంట అమ్మానాన్న. మేనత్త కొడుకని ఇష్టపడి చేసుకుంది. కాపురానికొచ్చాక తెలిసింది తాగుబోతని.”

పక్కనే నిలబడ్డ వంటావిడతో ‘వాళ్ళు రాత్రెప్పుడో వచ్చారు. కూడా కాఫీ ఇవ్వమని చెప్పింది.

‘ఇచ్చిందమ్మా, టిఫిన్ కూడా పెట్టింది.’

లోపలికి వెళ్ళి స్నానం చేసి తొమ్మిందింటికి రెడీ అయి ఓపీలో కూర్చుంది. ఇంకో గంటలో వాణివాళ్ల బంధువు వస్తాడు. డబ్బివ్వాలి. తగ్గిన నోట్లు గుర్తొచ్చాయి. ఎలా?

ఎవర్ని అడగాలి?

తలనొప్పిగా అనిపించింది , రాత్రి నిద్రలేకో, మరెందుకో.

ఏదో అలికిడి అయితే తలెత్తి చూసింది. పేషంట్ ని తీసుకొచ్చినావిడ నిలబడి ఉంది.

వెళ్తానని చెప్పడానికి వచ్చుంటుందని,

“సరే, మీరెళ్తారా. పర్లేదు వెళ్ళండి. ఆ అమ్మాయి భర్త వచ్చాడా? అతన్నొక సారి కనిపించమని చెప్పండి.”

“లేదమ్మా, నేనే ఉంటాను.” అంటూ కొంచం ఆగి “రాత్రంతా మేలుకుని ఎంతో శ్రద్ధగా చూశారు. మీమేలు మర్చిపోము.” అన్నదామె.

“పర్లేదులే. అదేమంత గొప్ప సాయం?” అని ఆపేసింది.

పొగుడుతుంటే తట్టుకోవడం మామూలు మనుషుల వల్లకాదు. అది దేవుడుకే సాధ్యం.

"కాదండీ ,అందరూ ఎందుకుంటారు మీలాగా?” ఆమె వెళ్ళకుండా అక్కడే నిలబడింది.

“ఆ పరిస్థితుల్లో డాక్టర్లెవరైనా అంతే చేస్తారు. సరేనా?" అంటూ లేచి నిలబడింది.

టైం కావొస్తోంది. లోపలికి వెళ్ళి కవర్ లో ఉన్న డబ్బు లెక్కపెట్టింది. రెండు వేలు తక్కువయింది.

ఇప్పటికిప్పుడు ఎవర్ని అడగాలి? ఆ పల్లెటూరో ఆమెకు అందరూ దగ్గర వాళ్ళేకానీ, డబ్బు తీసుకునేంత దగ్గర కాదు.

బాంక్ లోవి తీస్తే?

అక్కడి మేనేజర్ ఏమీ అనదుకానీ, ఇంటి మేనేజర్ తోనే ఇబ్బంది.

'ఎందుకు, ఏమిటి?' అని ఇప్పుడు ఆయనతో చెప్పే ఓపికలేదు.

తొమ్మిదిన్నర అవుతోంది. అతనొస్తే ఏం చెప్తుంది. రెండు వేలు తక్కువయ్యాయని చెప్పాలా?

లోపలికెళ్ళి అక్కడా, ఇక్కడా వెతికితే , ఒక వెయ్యి రూపాయలు దొరికాయి.

ఇంకో వెయ్యి కావాలి. ఎవరి దగ్గర తీసుకోవాలి. రాంబాబుని అడిగితే?

తనిచ్చే జీతమెంత?

ఇప్పటికిప్పుడు వెయ్యి రూపాయలు వాడి దగ్గర ఎందుకుంటాయి.

'ఏం చెయ్యాలీ?'కంగారుగా కన్సల్టేషన్ రూం లోకి వచ్చింది.

పక్కింటావిడ ఇంకా రూం లోనే నిలబడి ఉంది.

ఈమె వెళ్ళదేం?

"ఆ పిల్లకోసం ఎంతో చేశారు. రేత్రంతా నిద్ర కాశారు."

"పర్లేదు. మాకలవాటేలే అది." అంది.

"సెలైన్లేంటి, రక్తమేంటి, మత్తు డాట్టరి శార్జీలేంటి అంతా మీరే పెట్టారు."

"అవన్నీ సరేలే." ఆమె వెళ్తే , మిగిలిన డబ్బెలా సర్దాలో , తను ఆలోచించుకోవాలి.

"అమ్మా, అంటూ మీరేమనుకోనంటే" అంటూ మాట్టాడడానికి ఆమె వెనకాడుతోంది.

ఇంకా వెళ్ళదేంటి? విసుగ్గా ఉంది.

"త్వరగా చెప్పు." మాటల్లోనే తొందర చూపెడుతూ అంది.

"మీరు చేసిన దానికి ఇది చాలా తక్కువే అనుకోండి. కానీ మా మీద దయుంచి, ఇయ్యి తీసుకోండి. " అంటూ కొన్ని నోట్లు టేబిల్ మీద పెట్టింది.

అవి ఎంతో తెలియదు. చూస్తే ఎక్కువ మొత్తం లానే అనిపించింది.

రోజుకూలికెళ్ళే ఆమె దగ్గర అంత డబ్బుండడం ఎలా సాధ్యం?

"ఇంత డబ్బు నీకెక్కడిది?" ఆశ్చర్యంగా అడిగింది.

బాక్ బెంచ్ స్టూడెంట్ ఎప్పుడైనా ఫస్ట్ మార్క్ తెచ్చుకుంటే, క్లాస్ టాపర్ కు వచ్చే ఆశ్చర్యం!

"అప్పుడప్పుడు దాచుకున్న కూలి డబ్బులు. తప్పో ఒప్పో. అన్నీ మొగుడికిచ్చేస్తే అవసరానికెవుర్నడుగుతాం? ఈ పిల్లకెంత జెప్పినా ఇనదు. కూలిడబ్బులన్నీ మొగుడికిస్తది. ఆడంటే పడిసచ్చిపోద్ది.బలే సురుకా పోరగాడు. ఒక్క పైసా దీని చేతిలో ఉండనియ్యడు."

పేషంట్ గురించి చెప్తోంది.

"ఆళ్ళ అవసరమొస్తే అర్జంటంటారు. మనకవసరమొస్తే మానుకొమ్మంటారు . మొగుడు మెప్పుకోసం ఎంత జేసినా, ఆడికి పక్కింటో ఆడదే గొప్పగా కానొస్తది."

చిరునవ్వుతో ఆసక్తిగా వింటోంది డాక్టరమ్మ.

"దాసుకోడం చేతరాపోతే, ఎన్నేళ్ళు కూలి శేసినా, అలుపే మిగులుద్ది."

తమ విషయాలు ఆమెకెలా తెలుసూ?

ఆమె ముఖం వైపు చూసింది డాక్టర్. నిద్రలేక నలిగిన ముఖం. ఎండకు కమిలిన చర్మం. సరైన ఆహారం అందని ఆకారం. పేదరికం నిండిన బట్టలు.

సరస్వతి, తెల్ల పట్టుచీరలోనే ఉండాలా?

ఎప్పటికీ నేర్చుకోని పాఠాలు చెప్పినందుకు 'చాలా థాంక్స్.'

కొన్ని మాటలు పైకి అనలేము. లోపల అనుకోకుండా ఉండలేము.

"తీసుకోండమ్మా. ఇయ్యాల ఆ పిల్ల అమ్మా నాన్నలొస్తారు. ఆళ్ళు కలిగినోళ్ళే. ఆళ్ళు మీ ఫీజిచ్చేస్తే, నాయి నాకిచ్చేద్దురు గాని."

ఆ నోట్ల వంక చూసింది.

యాభైలు, ఇరవైలు , పదులు, నోట్లన్నీ కలిసి ఉన్నాయి.

మడతలు పెట్టిన నోట్లు. రంగుమారిన నోట్లు. వంట పసుపు అంటుకున్న నోట్లు.

"ఆమె దగ్గర తీసుకోవాలా వద్దా?" ఆలోచిస్తూ ఉంది.

"నీ పేరేంటి?" అడిగింది.

"సొరాజ్యం." స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లో పెట్టిన పేరు.

'ఆర్థిక స్వాతంత్ర్యం' ఏమిటో నేర్పిన గురువు.

"కాదనకండమ్మ." అంటూ నోట్లన్నింటినీ డాక్టరమ్మ దోసిట్లో పెట్టింది.

గురువే ఇచ్చిన దక్షిణ. కాదనడం ఎలా?

" అన్నీ వద్దు. వెయ్యి చాలు."

Post your comments

*ఈ కథలో డాక్టరమ్మ*
*నాకెంతో ఇష్టమైన స్నేహితురాలు.*
*డా. వై. హిమదేవి.*
*నెల్లూరులో గైనకాలజిస్ట్ గా పనిచేస్తోంది.*
*కవయిత్రి. ఏ సందర్భానికైనా సరే, చిటికెలో అద్భుతమైన కవిత్వం అందించగలదు.*
*మంచితనం, స్నేహగుణం, స్పందించే సున్నిత హృదయం కలిస్తే మా 'హిమ '*

